# ఆపేక్ష

శుమైతాంగి



ఉదయం తొమ్మిది గంటలయింది. కాఫీ చుక్క గొంతులో పోసుకుని వచ్చి నడవలో కూర్చుంది సత్యవతమ్మ గారు. ఆ టైములో ఆమెకు చేతినిండా పనే. కాస్త నిదానంగా ఊపిరి తీసుకోవడానికి కూడా ఖాళీ ఉండదు. కాని ఊపిరి సలపని ఆ పనిలోనే ఆమెకు ఎంతో సంతృప్తి, సంతోషము లభిస్తాయి.

“బామ్మా, నాకు జడవేయవూ? అమ్మమ్మా ఈ పూలు గుచ్చిపెట్టవూ?” నా పెన్సిల్ పోయిం దెక్కడో. నిన్ను అడిగి పట్టికెళ్లమంది అమ్మ”.. “నా పెన్నులో సిరా పోసి పెట్టవూ బామ్మా!” ఇలా వేధిస్తూ ఆమెను చుట్టేస్తారు ఆ వీధిలో పిల్లలు.

అయినా కసురుకోదు. ‘వాళ్లు నా పిల్లలా? పిల్లల పిల్లలా ఎందుకొచ్చిన తగలాటం నాకు’ అని విసుక్కోదు. వార్ధక్యం మీద పడినా కాస్త కూడా విసుక్కోకుండా ఎంతో ఓపిగ్గా అడిగిన అందరికీ అన్నీ చేసి పెడుతుందామె.

జడలు వేస్తుంది. పూలు గుచ్చి తలలో పెడుతుంది. పెన్సిల్ కోసం అలమరలన్నీ గాలించి వెతికి ఇస్తుంది. పెన్నులో సిరా పోసి ఇస్తుంది. పిల్లలకు స్కూలు టైము అయ్యేవరకు ఈ రకమైన పనులతో ఆ పిల్లలు తన పిల్లలే అన్నంత హడావిడి పడిపోవడం ఈ పదేళ్ల నుంచి ఆవిడకు అలవాటైపోయింది.

శని, ఆదివారాలైతే, చిరిగి పోయిన పుస్తకాలు అంటించి పెట్టడం, పుస్తకాలకు అట్టలు వేయడం, వాళ్లు చెవులు చిల్లిపడేలా అరిచి అల్లరిచేస్తూంటే విని భరించడం కూడా అలవాటైపోయింది. ‘ఇరుగు పొరుగు పిల్లలయిన వాళ్లకు నే నెందుకు చేయాలి? వాళ్ల అల్లరి నే నెందుకు భరించాలి? ఇందువల్ల నాకు వచ్చే లాభం ఏమిటి?’ అని స్వార్థంతో, స్వాతిశయంతో ఆలోచించుకోను ఆమెకు పడదు. ఆ పిల్లలు ఇలా వచ్చి తనను చుట్టుముట్టి హడావిడి పెడుతుంటేనే ఆమెకు ఆనందంగా ఉంటుంది. తప్పిపోయిన వరమేదో తిరిగి వచ్చినంత సంబర పడుతూంది కూడా.

పిల్లలు వెళ్లిపోగానే ఏదో కాస్త వండుకు తిని ఆ పిల్లల దగ్గరే అడిగి తీసుకున్న ఏ పుస్తకమో చదువుతూ కూర్చుంటుం దామె. సాయంత్రం కాగానే పిల్లలు మళ్ళీ ఓలబోల్లాడుతూ ఆ ఇంట్లోకి వస్తారు. ఆ ఇల్లు తమ

**వృద్ధాప్యం ఒక చిత్రమైన దశ. అందంగా, ఆనందంగా ఆ దశ చేరుకోవడం అందరికీ సాధ్యం కాదని అంటారు. ఏమైనా వయసులో ఉన్న తీరని కోరికలు వృద్ధాప్యంలో విజృంభించి మనిషిని ఒక ఆట పట్టించి అశాంతికి గురి చేస్తాయి. కాపీర్ణం పెరుగుతుంది. అన్నిటిలోకీ ధన దాహం మరీ విపరీతమైనది. అయితే ఇతరులకు కూడా ఆనందం పంచి ఇవ్వగల శక్తి కొన్ని బలహీనతలకూ ఉంది.**

స్వంత ఇళ్లే అన్నంత స్వేచ్ఛగా ఆడుకుంటారు, పాడుకుంటారు. అల్లరి చేస్తారు. అడపాదడపా ఆమెకు కూడా ఆటల్లోకి పిలుస్తారు "మా ఆటలు చూద్దువుగాని రా బామ్మా" అంటూ.

ఆ వీధిలో ఆడవారు సత్యవతమ్మగారిని పసిపిల్లలతో కలిసి ఆనందించే ఆమె మనస్తత్వాన్ని చూసి నవ్వుకుంటారు. "ఆవిడ కర్మకాలి వార్ధక్యం మీద పడింది గాని లేకపోతే తనూ చిన్నపిల్లే అనే అనుకుంటుందేమో" అని హేళనగా చెవులు కొరుక్కుంటారు. "ఆవిడకు చిన్నపిల్లలంటే చాలా ఇష్టం కాబోలు, ఆవిడ పిల్లలు పెద్దవాళ్లయ్యారు. ఎవరి గూళ్లు వాళ్లు నిర్మించుకుని తలో మూలకీ చెదరిపోయారు. వార్ధక్యంలో ఈవిడ ఒక్కర్తీ ఒంటరిగా ఉండలేక పిల్లల్ని అలా పోగుచేసుకుంటున్నది"— ఆవిడ మీద కాస్త సానుభూతి గల ఇల్లాలు సత్యవతమ్మగారిని వెనకేసుకొస్తుంది. ఎదటి వారిని ఎంతంటే ఊరుకోని మనసు అలవాటు కొద్దీ ఆరాతీస్తున్నా, తమ పిల్లల్ని ఆవిడ చేరదీయడం వలన వాళ్ల కెంతో సుఖంగా ఉంటున్నది. ఎందుకంటే, హడావిడిగా వంటచేసుకునే వేళల్లో 'అమ్మా జడవేయవూ? పెన్సిల్ చెక్కి పెట్టవూ?' అని పిల్లలు సతాయించే బాధ తప్పింది వాళ్లకు. పైగా సెలవు రోజున ఇంటి పట్టున ఉండి తమ అల్లరితో ఇంటి కప్పు ఎగరకొట్టే పని కూడా ఉండదు వాళ్లకు.

"చదువుకునే ఆడపిల్లలంటే సత్యవతమ్మ గారికి చాలా ఇష్టం. మీరు చూశారో లేదో, స్కూలు టైము అయిందంటే గుమ్మంలోనిల్చుని స్కూలుకి వెళ్లే ప్రతి ఆడపిల్లనూ ముచ్చటగా తిలకిస్తూ ఉంటుందామె!!" ఎన్నాళ్లనించో పరీక్ష చేసి గ్రహించిన సత్యాన్ని బైట పెడుతూ అంది అరుంధతి.

"ఆ సంగతి నేనూ కనిపెట్టా!" మరో మాట అనకుండా ఒప్పేసుకుంది పద్మావతి.

తను కాపురానికి వెళ్లిన కొత్తల్లో స్కూలుకి వెళ్లే పిల్లల్ని చూస్తూ ఇలాగే నిల్చుంటే అత్తా ఆడబిడ్డలు, తోడికోడళ్లు ఎంతో అపార్థం చేసుకుని నానా రభసా చేసేవారుట కూడా. సత్యవతమ్మగా రెప్పుడో చెప్పిన సంగతి జ్ఞాపకం వచ్చి నవ్వుతూ చెప్పింది మంగతాయారు.

"ఆవిడ వయసులో ఎవరూ ఇలా స్కూళ్లకి వెళ్లి చదువుకోలేదు కాబోలు అందుకే ఆవిడకు వింతగా ఉంటుందేమో?"

"వింతకాదు. ఈ రోజులే అప్పుడుంటే ఈ పిల్లల్లా నేనూ బాగా చదువుకునే దాన్నే కదూ అని ఆమె తపన..."

"తను చదువుకోకపోతేనేం తన పిల్లల్ని చదివించ వచ్చు గదూ?" పంకజం అంది.

"చదివించాలి అనుకుంటేనే జరిగిపోతాయా? ఈవిడ ఆశలు ఏ పిల్లలోనూ ఫలించలేదట. పాపం, ఆడపిల్లలు కొద్ది చదువులతోటే మొహాలు మొత్తి 'మేము చదువుకోము' అనేశారట. మగపిల్లలకి చదువు ఒంట బట్టక అచ్చిన ఆ కొద్దిపాటి చదువులతోనే ఎక్కడో గుమాస్తాలుగా బతికేస్తున్నారు."

"ఇప్పుడైతేమాత్రం ఏంపోయింది. పిల్లలతోపాటు ఆవిడనీ బడికి వెళ్లమంటే సరి"— వెటకారంగా నవ్వింది ఎదిరింటి సుందరమ్మ.

ఆ మాటలకి ఎవరూ జవాబు చెప్పలేదు. కయ్యానికి కాలుదువ్వే సుందరమ్మతో తీరుబడిగా వాగ్యుద్ధానికి ఎవరు దిగుతారు? పెళ్లయి పాతికేళ్లు దాటినా పుట్టని పిల్లలకోసం ఇంకా తపిస్తూనే ఉంటుందామె మనస్సు. అయినా ఎదటి వారి తపన అర్థం చేసుకో లేదు. తీరని తృష్ణ మనిషిని జీవితాంతమూ వెంబడిస్తూనే ఉంటుందనే సత్యం ఆమెకు తెలియదు. తన కెలాగు పిల్లలు లేరు. ఇతరుల పిల్లల్ని చూసైనా ఆనందించాలి అనుకోదామె. ఏ పిల్లలయినా తప్పి జారి ఆ గుమ్మంలో కెళ్లారా "ఏం? ఈ ఇల్లు తప్పించి మరో ఇల్లు దొరకలేదూ మీ ఆటలకి? పొండి. మళ్లా వచ్చారంటే కాళ్లు విరగ్గొడతాను" అని అరిచి తిడుతుంది, వీలైతే నాలుగు వడ్డిస్తుంది కూడా. ఆ వీధిలో పిల్లలకు సుందరమ్మంటే సింహ స్వప్నమే. "సుందరమ్మత్తేనా! అమ్మో! రాక్షసి" అని తిట్టుకుంటారు వాళ్లు.

శివరామయ్యగారు భార్య ఓపిక్కి నవ్వుకుంటూ "ఇరుగు పొరుగు పిల్లలు నీ పిల్ల లౌతారా? ఎంత చేసినా ఆ 'పరాయి' అనే భావం పోతుందా? వాళ్ల పెరిగి పెద్దయితే వాళ్లెవరో, నీ వెవరో, పిల్ల గురించి నీ కంత శ్రమ దేనికి?" అని మందలించేవారు.

"వాళ్ల నాకేదో ఒరగ బెడతారనుకుంటే వాళ్లని చేరదీసేది? కడుపున పుట్టిన వాళ్లే మమతలు మరిచి దూరాన్ని పెంచుకుంటే పరాయి అమ్మ గన్న బిడ్డలు ఓ లెక్కా? వాళ్లని చూస్తుంటే నా బాల్యం గుర్తు వస్తుంది. నా బిడ్డల ఆట పాటలు మదిలో మెదులుతాయి. పిల్లల్లో దైవత్వాన్ని చూస్తున్నట్లుగా మనసులో తృప్తి, ఆనందాన్ని పొందుతాను" అనేది సత్యవతమ్మగారు.

జీవితపు గడువుని తీర్చుకుని ఆయనా మట్టిలో కలిసిపోయాడు. కొడుకులు తల్లిని తమ దగ్గిర ఉండమని చెప్పారు. కూతుళ్లు అర్థించారు, తమ దగ్గిరికి రమ్మని. కాని ఆవిడ ఎవరి దగ్గిరా ఉండటానికీ ఇష్టపడ లేదు. "నా తనువూ ఇక్కడే పోనివ్వండర్రా!" అనేసింది. పెద్ద వయస్సులో ఒకరికి భారంగా ఉండటం ఆమె కిష్టం ఉండదు.


"ఆడవాళ్లకు చదువెందుకు? చాకలి పద్దు వేసుకునే పాటి చదువుంటే చాలు ఆడదానికి?" అని స్త్రీ విద్యను ఈసడించే రోజుల్లో సామాన్యుల ఇంట పుట్టి మూర్ఖాభిప్రాయాలు గల వాళ్ల మధ్య పెరిగిన సత్యవతమ్మ గారికి చదువుకోవాలనే కాంక్ష ప్రబలంగా ఉన్నా అది గగన కుసుమమే అయింది.

"అన్నయ్యలు, తమ్ముళ్ళు చదువుకోగా లేనిది నే నెందుకు చదువుకోరాదు?" అనే వితండవాదన చేసినా అది అరణ్య రోదనమే అయింది గాని ఫలితం లేకపోయింది. అక్కడికీ తృష్ణ ఆపుకోలేక అన్నలు, తమ్ముళ్ల చదువుకునే టప్పుడు వాళ్ల దగ్గిర కూర్చుని చదువుకుంటూ తెలియనివి అడిగి తెలుసుకుంటూ వచ్చింది.

"చదివింది చాల్లే ఇంకా చదివి మగరాయడ వవుతావా?" అని విరుచుకు పడేది నాయనమ్మ. "ఈ ఉత్తరం చదివి పెట్టమ్మా, ఈ నోటు మాసి వడ్డీ కట్టమ్మా" అని ఎవరో

**ప్రాచి నుదుటి పాపట బొట్టు**

ఫోటో — ఐ. వి. కుమార్



ఒకరు వస్తూంటే చేతిలో పని వదిలేసి వాళ్ల పని చేసిపెట్టే కూతురి వైపు మిర్రిమిర్రి చూసేది తల్లి. 'ఆడ పిల్లకు చదువు వస్తే ఇదే బాధ?' అని విసుక్కునేది అక్షర మంటే ఏమిటో ఎరుగని తల్లి. అటువంటి వాళ్ల మధ్య పెరుగుతూ భారత, భాగవతాలు చదివి అర్థం చేసుకో గల శక్తి వరకు విద్యను స్వయం కృషితో అభ్యసించింది సత్యవతమ్మగారు.

పారుగూళ్ళో ఉద్యోగంలో ఉన్న అన్నగారు "నీ పెళ్లికి నీకు ఏ కానుక తెచ్చిపెట్టను?" అని వ్రాస్తే "నాకు మంచి పుస్తకాలు, • విలవైనవి తెచ్చి పెట్టరా అన్నయ్యా!" అని వ్రాసిం దామె.

ఆ మూడో నాడు ఇన్ని పుస్తకాల పాకెట్లతో వచ్చిన కొడుకుని చూసి తల్లి, నాయనమ్మ, తండ్రి అంతా కేకలేశారు. "దానికి మతిలేదంటే నీకూ లేదా. చిన్నపిల్ల తెలియక ఏదో వ్రాస్తే అయిన డబ్బంతా తగలేసి ఇవా తెచ్చేది?" అని ముక్క చీవాట్లు పెట్టేశారు. కాని తన కోర్కెప్రకారం పుస్తకాలు తెచ్చినందుకు సత్యవతమ్మ గారు ఎంత సంతోషించిందో ఆ భగ వంతుడికే తెలుసు! 'నువ్వెంత మంచి వాడివిరా అన్నయ్యా!' అని మురిసి పోతూ ఆ పుస్తకాలను తన పెట్లో పదిలంగా దాచుకున్న ఆమె 'వీటి విలవ మీకేం తెలుసమ్మా' అనుకుంది–తల్లిని నాయనమ్మను ఉద్దేశించి.

అత్తవారిల్లు బస్తీలో అని, తన భర్త బాగా చదువు సంస్కారం గలవాడే అయినందుకు జీవితంలో సాధించలేనిది ఇకముందు సాధించగలను అనే ధీమా మనస్సులో నిండిపోయింది. 'నే నెంత అదృష్టవంతురాలిని' అని గర్వంతో పొంగిపొరలే నదీ ప్రవాహంగా ఉప్పొంగి పోయిందామె అంతరంగం. కాని అత్తా రింట్లో అడుగు పెడుతూనే 'ఇది ఒక మహా సాగరం. దీనిలో పడినవారికి విముక్తి లేదు!' అని త్వరగానే గ్రహించి విషాదంగా నవ్వుకుందామె.

బండెడు సంసారం గల అత్తవారిల్లు పెళ్లి ఇల్లులా ఎప్పుడూ విందుగా కలకల్లాడుతూ ఉండేది. వాస్తవమే గాని వేళగాని వేళల్లో వచ్చిపోయే చుట్టా లకు వండి వడ్డించడానికే ఆ ఇంటి కోడళ్లకు సరిపొయ్యేది. ఇంటపెత్తనం చలాయించే అత్తగారు కోడళ్లను ఓ కంట కనిపెడుతూనే ఉండేది. అంత చాకిరీలోనూ పనులు తెముల్చుకుని ఏదో వేళ పుస్తకం పట్టుకుని కూర్చుంటేనే గాని తోచేది కాదు సత్యవతమ్మగారికి. ఇంటి ఎదురుగా కాన్వెంట్ స్కూల్ ఉంది, స్కూలు గంట గణగణమని వినిపించగానే తను వెళ్లి వీధి గదిలో కిటికీ దగ్గిర నిల్చునేది. ఆడ, మగ, అంతా యూనిఫారమ్‌లతో, కలకల్లాడే వదనాలతో నవ్వుతూ తుళ్లుతూ ఆ వీధికే వింత అందాన్ని దిద్దుతూ హడావిడిగా పరుగెడుతూంటే ఆవిడ గుండెలు తీరని కోర్కెతో గుబగుబ లాడేవి. ఎన్ని కలలు కంటూ వచ్చింది ఇక్కడికి? తనవి ఆకాశ హర్మ్యాలై పోయాయి. ఉద్యోగ నిర్వహణతో క్షణం తీరని భర్తకు తన భార్య మనసెలా అర్థం అవుతుంది? అసలు అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే కదూ?

"నేను చదువుకోలేకపోతేనేం నా పిల్లల్ని చదివిస్తాను, బాగా చదివిస్తాను. అంతా ఆశ్చర్యపడేలా చదివిస్తాను" చదువుకునే పిల్లల్ని చూస్తూ ఆ ఆశలు పెంచుకునే దామె మనసు.

సంవత్సరాలు గతంలోకి జారిపో తున్నాయి. వయస్సుతోపాటు బాధ్య తలు, బరువులు పెరుగుతున్నాయి. అయిదుగురు బిడ్డల తల్లిగా నిలబడిన సత్యవతమ్మగారికి తను పెట్టుకున్న ఆశలు తీరలేదు. కాని, జుత్తుమాత్రం పండిపోయిందప్పుడే. పిల్లలు పెద్దవా ళ్లయ్యారు. తలో మూలకి వెళ్లి పోయారు జంటలతో.

'వాళ్ల పిల్లల్నయినా చదివించు కోరూ?' అనుకుంటుందిప్పుడు...

"మీరు బాగా చదువుకుని పైకి వచ్చా రంటే మీకు మంచిమంచి బహుమతు లిస్తానర్రా" అని మనవళ్లకి, మనవ రాళ్లకి ఉత్తరాలు రాస్తుం దెప్పుడైనా.

'బామ్మ ఇచ్చే బహుమ తేలా ఉంటాయో? బహుశా ఏ సైకిలో వాచీయో కొనిస్తుందేమో?' అను కొంటారు మనవళ్లు.

"ముత్యాల నెక్లెసో, గాజులో, చేయిస్తుందేమో" అని మనవరాళ్లు ఊహించి మురిసిపోతారు.

• • •

ఆ రోజు మధ్యాహ్నం సుందరమ్మ ఇంటి వసారాలో సభ తీర్చి కూర్చు న్నారు ఆ వీధిలో ఆడవారు.

"విన్నారా ఈ సంగతి?" తలెగరేసి చిత్రంగా నవ్వింది పంకజం.

"ఏమిటేమి టీ?" నాలుగు కంఠాలు ఆత్రంగా అడిగాయి.

"సత్యవతమ్మగారు పరీక్షకి కూర్చో బోతున్నారట! ఎక్కడన్నా విన్నారా ఈ విడ్డూరం? అరవై యేళ్ళొచ్చాక ఇదేం బుద్ధి ఆవిడకు?"

"అందుకే కాబోలు ఈ మధ్య అసలు కనిపించడం లేదావిడ. అయినా ఈ వయసులో చదువేమిటి? నలు గురూ విని నవ్వుకోవడానికి కాకపోతే?" తీవ్రంగా విమర్శించింది సుందరమ్మ.

"ఉద్యోగం చేస్తుందేమో కాబోలు!" కిలకిలా నవ్వింది పద్మావతి.

"అలాగే ఉంది ఆవిడ తీరు చూస్తూంటే."

అసలు జరిగిం దేమిటంటే?–

రెండు రోజుల క్రితం జడ వేయిం చుకోడానికి వెళ్లిన శశి "బామ్మా మాకు పరీక్ష లొస్తున్నాయి తెలుసా?" అంది.

నాలుగు రోజులనుంచి ఒంట్లో బాగోక అనారోగ్యంతో బాధపడుతున్న సత్యవతమ్మగారు నిర్లిప్తంగా నవ్వుతూ "నాకూ, పరీక్ష దగ్గిర పడిందమ్మలూ!" అంది తనకీ రోజులు దగ్గిర పడ్డవనే భావంతో గూఢార్థంగా. ఆ మాటని మరోలా అర్థం చేసుకున్న శశి

**అపోలో వ్యోమగాములు దివి నుండి భువికి తెచ్చిన చంద్రశిల నొకదానిని హైదరాబాదులో మరల సెప్టెంబరు 29 నుండి అక్టోబరు 2 వరకు ప్రదర్శిస్తున్నారు. ఈ ఫోటోలో సినీతార వెన్నిరాడై నిర్మల చంద్రశిలనుచూస్తున్న దృశ్యం**



"అమ్మా, బామ్మకి కూడా పరీక్షలే నటమ్మా" అంది తల్లితో. ఆ మాటకి అంతా నవ్వుకున్నారు– 'ఆవిడకు మతిగాని పోయిందా లేకపోతే ఈ వయసులో ఇదేం బుద్ధి?' అని.

ఆ మాటే పెద్ద చర్చనీయాంశ మయిందా రోజు మహిళా సమావేశంలో.

వరుసగా నాలుగు రోజులు ఆవిడ మొహం వీధి కిటికీలో కనిపించక పోయేసరికి పంకజానికి మనస్కరించలేదు. పంకజం ఇంట్లో కెళ్ళేసరికి మంచానికి బల్లిలా అంటుకుపోయి కళ్ళలో ప్రాణం నిల్పుకున్నట్లు కనిపించింది. సత్యవతమ్మగారు. ఎప్పుడూ నవ్వుతూఉండే ఆ వదనంలో తొంగిచూసే మృత్యుచ్ఛాయలకు పంకజం అదిరి పడింది. ఆమె హృదయం స్త్రీ జన సహజ గుణంతో కరుణారస ప్లావిత మయింది. 'అయ్యో!' అని అదుర్దాగా నిట్టూర్చింది. "మీకు ఒంట్లో బాగోడం లేదని నాకెందుకు చెప్పలేదు అత్తయ్యగారూ?" అని నిష్ఠూరమాడింది. తను చేయగల సాయమంతా చేస్తూ తన కొడుకుతో ఆమె పిల్లలకు ఉత్తరాలు రాయించింది. అర్జెంటుగా రమ్మని మూడో రోజుకే పరుగెత్తుకొచ్చారు కొడుకులు కూతుళ్ళను.

"బామ్మా ... బామ్మా .... అమ్మమ్మా! మాకు బహుమతు లిస్తానన్నావు ఏవీ?" అని మనుమలు, మనుమరాళ్ళూ వేధించారు కాస్సేపు. 'అలాగే ఇస్తా' అన్నట్లు సైగతో భావ ప్రకటన చేసిందామె.

'అమ్మ ఎన్నాళ్ళో బ్రతక దిక' నిర్ణయాని కొచ్చారు కొడుకులు మాతృమూర్తిని చూసి దిగులుగా.

"అమ్మ ఇంకా కొన్నాళ్ళు బ్రతకాలి మాకోసమైనా!" దిగులు నిండిన గుండెలతో తెంగటిల్లి పోయారు ఆడపిల్లలు.

ఆడపిల్లల తృప్తికోసం తల్లికి మందు లిప్పిస్తూనే ఉన్నారు కొడుకులు మనసులోమాత్రం–'అమ్మదగ్గిర ఏమాత్రం డబ్బు ఉందో? ఒంటరి ప్రాణం అప్పుడప్పుడు మేము పంపించిన డబ్బుఅంతా ఎక్కడో దాచే ఉంటుంది మరి, చివరి క్షణాల్లో అయినా ఆ సంగతి చెప్పదేంగో' అని మళ్ళా తిరిగే ఆలోచనలతో సతమతమై పోతున్నారు.

'చాటుగా కూతుళ్ళ కందిస్తుందేమో?' అనుమానం నిండిన అంతరంగాలతో ఆడబిడ్డల్ని ఓ కంట కని పెడుతూనే ఉన్నారు కోడళ్ళు.

'మా కెప్పుడూ పది రూపాయలు పెట్టి చీర కొనిపెట్టిందా అమ్మ? అక్కడనుంచి తెచ్చుకుని అదే పట్టుకు పోయే వారం గాని! అవసానదశలో అయినా అమ్మ కొద్దో గొప్పో ముట్ట జెప్పక పోతుందా' అని ఆడపిల్లల పేరాశ. కాని ఎవరి ప్రలోభాలు తీర్చకుండానే ఆమె అకస్మాత్తుగా కన్ను మూసింది ఒక రోజున.

అన్ని కర్మలు సక్రమంగా జరిపించారు ఇద్దరు కొడుకులూను. పెట్ట వలసిన సారె అంతా ఇదివరకే పెట్టేసింది గనక ఆడపిల్లలు అదికావాలి ఇది కావాలి అని పేచీ పెట్టకుండా, వెళ్ళడానికి పెట్టెలు సర్దుకోసాగారు. కాని మనసులో భారం పైకి వ్యక్తీకరించక పోయినా వాళ్ళ దృష్టి మూలనున్న తాళం వేసిన రంగూన్ కావడి పెట్టె మీదే ఉండిపోయింది. కోడళ్ళ మనసూ ఆ పెట్టెమీదే ఉండిపోయింది. 'బహుశా అత్తగారు డబ్బంతా ఆ పెట్టెలో దాచి ఉంటారు' అని. కొడుకులకూ అదే అనుమానం వచ్చింది. పెద్దకొడుకు తాళంచెవులున్నా వెదికి దాని తాళం తీశాడు అంతా ఉండగానే.

అంతా ఉద్విగ్న చిత్తులై అటే చూడసాగారు. పెట్టె మూతతీస్తూనే ప్రేక్షకులంతా గుడ్లప్పగించినట్లు

బోసిపోయి ఫోటో — శైలేష్ వర్మ (వరంగల్లు - 4)



కొయ్యబారి పోయారు కొన్ని క్షణాలు.

"అమ్మో! ఎన్ని పుస్తకాలో!" ఓ పిల్లాడు వివరించుకోలేక ఓ గావుకేక పెట్టాడు. 'మేము పంపిన డబ్బంతా వీటికి వినియోగించిందా తను?' వివర్ణ వదనులైనారు కొడుకులు. "తన విద్యా దాహాన్ని ఇలా తీర్చుకున్నదా అమ్మ!" ఆడపిల్లలు కన్నీళ్ళు గ్రుక్కుతూ వెక్కి వెక్కి ఏడ్చారు. సత్యవతమ్మగారి తీరని తృష్ణకు ప్రతిబింబాల్లా పక్కున్నాయి అట్టలు నలగని కొత్త పుస్తకాలు కూడా. 'ధనం దాచలేదు, మమ్మల్ని దాచుకున్నారంటె పదిలంగా, తర తారాలు మీకు విజ్ఞానాన్ని దార పోస్తాము' అనే సత్యాన్ని చాటుతున్నట్లు... ★

